క్లుప్తంగా

వైభవంగా హనుమత్ రక్ష యాగం పూర్ణాహుతి

నూజెండ్ల: మండలంలోని రవ్వారం గ్రామ సమీపాన ఉన్న శ్రీ వెంకటేశ్వర జగన్మాత పీఠంలో శనివారం హనుమత్ రక్ష యాగం పూర్ణాహుతిని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉగాది పర్వదినం రోజున ప్రారంభమైన యాగంలో దేశ, విదేశాల నుంచి భక్తులు హాజరయ్యారు. హనుమాన్ చాలీసా పారాయణం, రామనామలేఖన కార్యక్రమంలో పాల్గొన్నారు. లోక క్షేమం, దేశ వైభవ సిద్ధి ధ్యేయంగా సాగిన పారాయణం ముగింపు రోజు పూర్ణాహుతి, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు.

సైనిక్ స్కూలుకు విద్యార్థి ఎంపిక



రొంపిచర్ల : స్థానిక బీసీ కాలనీలో గల కేరళ మోడల్ స్కూల్ విద్యార్థి నరాల మనీష్ రెడ్డి ఆల్ ఇండియా సైనిక్ స్కూలుకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ గెల్లి గాలిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 5న ఆరో తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో మనీష్ రెడ్డి మంచి మార్కులు సాధించి ఎంపికయ్యాడని వెల్లడించారు. ఈ సందర్భంగా మనీష్ రెడ్డిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామపెద్దలు అభినందించారు.

రక్తదానం ప్రాణ దానంతో సమానం



చిలకలూరిపేట: రక్తదానం ప్రాణ దానంతో సమానమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ చిలకలూరిపేట రెడ్‌క్రాస్ బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌తో పాటు రెడ్ క్రాస్ సంస్థను బలోపేతం చేసేందుకు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. తహసీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ జిల్లాలో రక్త నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. చిలకలూరిపేట పట్టణం జాతీయ రహదారిపై విస్తరించి ఉన్న నేపథ్యంలో ప్రమాదాలలో గాయపడిన వారికి రక్తం ఆవశ్యకత ఎంతో ఉంటున్నదని వెల్లడించారు. అనంతరం రక్తదానం చేసిన 21 మందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరిబాబు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి, జంపని భాస్కరరావు, చుక్కా విన్సెంట్‌పాల్, ఆర్‌ఐ రమీజా పాల్గొన్నారు.

విద్యార్థి జాషువాకు నగదు బహుమతి



రొంపిచర్ల: ఈ ఏడాది కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన నందిగం జాషువాకు అదే గ్రామానికి చెందిన పఠాన్ రంజాన్ బీ రూ.5 వేల నగదు బహుమతిని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా రంజాన్ బీ మాట్లాడుతూ చదువులో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నగదు అందించినట్లు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన జాషువాను ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, గ్రామపెద్దలు నందిగం దాసు, శ్యాంబాబు కుటుంబ సభ్యులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. చిలకలూరిపేట అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిలకలూరిపేటకు చెందిన శ్రీను కుమారుడుతో కలిసి ద్విచక్ర వాహనంపై యడ్లపాడు వస్తున్నారు. ఈ సమయంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తిమ్మాపురం వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో శ్రీను, అతని కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న హైవే పోలీసులు బాధితులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఈఎస్‌ఐ కార్డుదారులకు వైద్య శిబిరం నేడు

పిడుగురాళ్ల: ఈఎస్‌ఐ కార్డుదారుల కుటుంబ సభ్యులకు అంజిరెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించనున్నట్లు డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి శనివారం తెలిపారు. అంజిరెడ్డి హాస్పిటల్‌కు వస్తే ఉచితంగా ఓపీ, రక్త పరీక్షలు, మందులు ఇవ్వటం జరుగుతుందని వివరించారు. అయితే వైద్య శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు, ఈఎస్‌ఐ కార్డుతోపాటు మూడు ఫొటోలు తీసుకొని రావాలి సూచించారు.

ప్రభుత్వ అక్రమ కేసులపై పోరాటం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



పార్టీ కార్యాలయంలో డాక్టర్ గోపిరెడ్డిని సన్మానించిన లీగల్ సెల్ న్యాయవాదులు

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు ప్రభుత్వ అక్రమాలు, అక్రమ కేసులపై పోరాడాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా, నియోజకవర్గ పార్టీ అనుబంధ విభాగాల్లో నూతనంగా నియమితులైన న్యాయవాదులు శనివారం పార్టీ కార్యాలయంలో డాక్టర్ గోపిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. అనంతరం డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పార్టీ అనుబంధ విభాగాల్లో నలుగురు న్యాయవాదులు జిల్లా అధికార ప్రతినిధిగా రాపోలు శ్రీనివాసరావు, నియోజవర్గ లీగల్ సెల్ విభాగ అధ్యక్షులుగా వై.సీతారామరెడ్డి, ఆర్టీఐ విభాగ అధ్యక్షులుగా జీనేపల్లి హనుమంతరావు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ విభాగ అధ్యక్షురాలిగా గార్లపాటి మేరీ బ్లెస్సినా నియమితులు కావడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో న్యాయవాదుల అవసరం పార్టీకి ఎంతో ఉందని చెప్పారు. సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండి, ఆదర్శ భావాలు కలిగిన ఈ న్యాయవాదులు పార్టీలో పదవులు పొందడం భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. న్యాయవాదులు మాట్లాడుతూ తమకు పదవులు వచ్చేందుకు సహకరించిన డాక్టర్ గోపిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో ఆయనతో పాటు రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, న్యాయవాదులు మల్లెల అశోక్, భవనం శ్రీనివాసరెడ్డి, జంగాల మాణిక్యమ్మ, మల్లెల అనిల పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలకు పెద్దపీట

రాబోయే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలే కీలక పాత్ర పోషించనున్నారని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇటీవల కేంద్ర పార్టీ కార్యాలయం ప్రకటించిన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన నాయకులు తమ మద్దతుదార్లతో శుక్రవారం సాయంత్రం పార్టీ కార్యాలయానికి వచ్చి డాక్టర్ గోపిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ను శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. దీంతో పార్టీ కార్యాలయంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం గోపిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఆవిర్భావం నుంచి పార్టీని నమ్ముకుని జెండా మోసి కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు కీలకమైన పదవులు ఇవ్వడం చాలా సంతోషకరంగా తెలిపారు. పదవులు రాని వారు నిరాశ చెందవద్దని అందరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శిగా రొంపిచర్ల మండలానికి చెందిన పడాల చక్రారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా పచ్చవ రవీంద్ర, జిల్లా ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షులుగా పల్లెర్ల మల్లికార్జునరెడ్డి, బీసీ విభాగం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా పల్లెపు అంజయ్య, పార్టీ జిల్లా కార్యదర్శిగా గెల్లి చినకోటిరెడ్డి, జిల్లా కోశాధికారిగా నియమితులైన అన్నే చంద్రమోహన్, నియోజకవర్గ కోశాధికారిగా నియమితులైన మిట్టపల్లి శేఖర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు.



డాక్టర్ గోపిరెడ్డిని సన్మానించిన పట్టణ ఆర్యవైశ్య నాయకులు

● రొంపిచర్ల మండలం, పట్టణ ఆర్య వైశ్య ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని పదవులు పొందిన తమ నాయకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల సాంబశివారెడ్డి, మండల కన్వీనర్ కురుగంటి శ్రీనివాసరెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు అన్నెం పున్నారెడ్డి, ముంద్రు హరినారాయణ, మోతుకూరి వెంకటేష్, మునమాక షేక్ కరీముల్లా, పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు కొత్తమాసు మల్లారావు, నిడమానూరు సురేంద్ర, కొత్తూరు కిశోర్, బి.నాగేశ్వరరావు, పలు గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రొంపిచర్ల మాజీ సర్పంచ్ చక్రారెడ్డికి సన్మానం



రొంపిచర్ల : వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం జనరల్ సెక్రటరీగా రొంపిచర్ల గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఆయన్ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌గా చక్రారెడ్డి గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. తనకు పదవి రావడానికి దోహదపడిన మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి, నరసరావుపేట మాజీ శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి చక్రారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ మండల శాఖ సమావేశం

రొంపిచర్ల : స్థానిక కేరళ మోడల్ స్కూలులో ఆదివారం సీపీఐ మండల శాఖ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శులు కాసా రాంబాబు, షేక్ హుస్సేన్ పాల్గొంటారని పేర్కొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో పలువురికి ఉద్యోగావకాశాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల చైర్మన్ శేషగిరిరావు

నరసరావుపేట రూరల్: కేసానుపల్లిలోని ఎంఏఎం కళాశాలలో శనివారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఎంబీఏ, ఎంసీఏతో పాటు ఇంజినీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ ఎంపికలో పాల్గొన్నారు. మ్యాజిక్ బస్ ఇండియా నిర్వహించిన డ్రైవ్‌లో హైద్రాబాద్‌కు చెందిన త్రిషోల్డ్ సొల్యూషన్స్ సంస్థ ఐదుగురిని, ఇన్ఫోకస్ బ్యాక్ గ్రౌండ్ చెక్స్ సంస్థ తొమ్మిది మందిని, అక్రోసాఫ్ట్ సొల్యూషన్స్ సంస్థ ముగ్గురిని ఉద్యోగాలకు ఎంపిక చేశాయి. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎం.ఆర్. శేషగిరిరావు, డైరెక్టర్ దరువూరి శ్రావ్య, వివిధ విభాగాధిపతులు నవీన్, సితార, రాధిక, ఫణిబాబు, రవిశంకర్, అధ్యాపకులు అభినందించారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

చిలకలూరిపేట టౌన్ : మద్యం మత్తులో రోడ్డు పక్కన చెట్టు కింద కూర్చున్న వ్యక్తిని కారు ఢీకొట్టిన సంఘటన పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసరావుపేట వైపు నుంచి చిలకలూరిపేట వస్తున్న కారు పట్టణంలోని ఎన్నార్టీ రోడ్డు, భారత్ పెట్రోలు బంకు ఎదురుగా వచ్చేసరికి రోడ్డు మార్జిన్‌లోకి వెళ్లి అదుపుతప్పింది. చెట్టుకింద కూర్చున్న మంగలిషాపు యజమానిని ఢీకొంది. స్థానికులు భయాందోళనతో పరుగులు తీశారు. గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఇన్నర్ వీల్ క్లబ్ సామాజిక సేవలు అభినందనీయం



దివ్యాంగురాలికి ట్రై సైకిల్ పంపిణీ

చిలకలూరిపేట: సామాజిక సేవలతో పాటు మహిళల్లో న్యాయ పరిజ్ఞానం పెంపొందించేందుకు ఇన్నర్ వీల్ క్లబ్ చేస్తున్న కృషి అభినందనీయమని న్యాయవాదులు నన్నెబోయిన శ్రీనివాసరావు, మాదాసు భానుప్రసాద్ చెప్పారు. పట్టణంలోని సుగాలి కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో శనివారం మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. హక్కులు తెలుసుకుంటేనే వాటిని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యురాలు ఆలేటి రమాదేవి ఆర్థిక సహాయంతో దివ్యాంగురాలైన భీమిబాయికి ట్రై సైకిల్ అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని, కార్యదర్శి నార్నె జయలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలి



సమావేశంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

వినుకొండ: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో ఈ నెల 21న ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన 27 మంది మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మృతదేహాలను కుటుంబసభ్యులకు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకోవడంతో వారు ఏపీ హైకోర్టులో పిటిషన్ వేశారన్నారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు ఇవ్వాలని కోర్టు ప్రకటించిందని తెలిపారు. చర్చలు జరపకుండా కాల్పులు చేయడం దారుణమని ఖండించారు. కార్యక్రమంలో లిబరేషన్ పార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శి తోట ఆంజనేయులు, ఎస్కే ఫిరోజ్, కామా వెంకటేశ్వర్లు, ప్రసాద్, పీడీఎం రాష్ట్రనాయకులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి. రామకృష్ణ, ప్రసాద్, పౌరహక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చిన్న, బీసీ నాయకులు బత్తుల వెంకట్రావు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు జలకళ



నరసరావుపేట: పట్టణ ప్రజలకు తాగునీరు అందించే నకరికల్లు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు నాగార్జునసాగర్ నీటిని శనివారం నుంచి మళ్లించారు. 267 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ట్యాంకును ఒకసారి పూర్తిగా నింపితే 90రోజుల పాటు పట్టణ ప్రజలకు తాగునీటికి ఢోకా ఉండదు. ఇటీవల సాగర్ కుడి కాలువకు నాలుగు టీఎంసీలు విడుదల చేసిన సంగతి తెలిసిందే. బుగ్గ వాగు నుంచి విడుదలైన నీటిని మెయిన్ కెనాల్ నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు మళ్లించే ప్రక్రియను మున్సిపల్ ఇంజనీర్ కె.కనకారావు, డీఈ మహమ్మద్ రఫీ పర్యవేక్షించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ప్రమాదం



వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో వేస్తున్న ఎంపీడీవో పుట్టారెడ్డి

వినుకొండ: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ప్రమాదమని ఎంపీడీవో పుట్టారెడ్డి తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన శనివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. కాలుష్యాన్ని అరికట్టి భవిష్యత్తు తరాలను కాపాడుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుందరరెడ్డి, ఏవో వెంకటరవి, స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ పచ్చిగొళ్ల ప్రభాకరరావు, ఏపీవో కట్టా నాగేశ్వరరావు, నడిగడ్డ మాజీ సర్పంచ్ గోవిందరాజులు, వీరాంజనేయులు, వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నూజెండ్లలో..

మండలంలోని ఉప్పలపాడు గ్రామ సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి రవీంద్ర అధ్యక్షతన ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటరు కంచర్ల సుబ్బరామయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లీబాయిపాలెంలో తాగు నీటి సమస్యను పరిష్కరిస్తాం



మినీ ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించే స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఉమాదేవి

నూజెండ్ల: తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని ముతరాసుపాలెం శివారు అల్లీబాయిపాలెం గ్రామస్తులు ఇటీవల ఎంపీడీఓ పావులూరి ఉమాదేవి దృష్టికి తెచ్చారు. దీంతో ఆమె శనివారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపట్టారు. కొత్తజడ్డావారిపాలెంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి అల్లీబాయిపాలెంలో నిర్మించనున్న మినీ ఓవర్ హెడ్ ట్యాంక్ స్థలాన్ని పరిశీలించారు. త్వరలో ఓవర్ హెడ్ ట్యాంకు ఏర్పాటు చేసి, కుళాయిలు ద్వారా తాగునీటిని గ్రామస్తులకు సరఫరా చేస్తామనిఎంపీడీవో గ్రామస్తులు హామీ ఇచ్చారు. ఆమె వెంట ఏపీవో ఆంజనేయరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతిరావు ఉన్నారు.

‘చలో విజయవాడ’ను జయప్రదం చేయండి

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్రోసూరు తాలూకా అధ్యక్షుడు శ్యాంసన్



బెల్లంకొండలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘు నాయకులు

బెల్లంకొండ: విజయవాడలో జూన్ 5న జరిగే ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర సంఘ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం క్రోసూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు శిఖా శ్యాంసన్ కోరారు. శనివారం మండల కేంద్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. కౌన్సిల్ సమావేశాలలో మండలంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అనంతరం సమావేశాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బసవకుమారి, అసోసియేట్ ప్రెసిడెంట్ జె.వి.ప్రసాద్‌రావు, యూనిట్ ఉపాధ్యక్షుడు వీరయ్య ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజుపాలెం: జూన్ 5వ తేదీన విజయవాడలో జరిగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఏపీజీఈఏ క్రోసూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు శిఖా శ్యాంసన్ కోరారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగ సంఘం సభ్యులు ‘చలో విజయవాడ’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రచారం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో గోడ ప్రతులను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్రోసూరు యూనిట్ అధ్యక్షుడు శిఖా శ్యాంసన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 3వ తేదీ నుంచి ఏపీజీఈఏ రాష్ట్ర మహాసభలు జరగనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభలకు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పింఛన్‌దారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ బసవకుమారి, వైస్ ప్రెసిడెంట్ జీవన్‌రావు, ఉపాధ్యక్షుడు వీరయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఏపీజీఈఏ గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

గో వధను నిషేధిద్దాం.. హిందూ ధర్మాన్ని కాపాడుదాం

అచ్చంపేట: గో వధను నిషేధించి హిందూ ధర్మాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విశ్వ హిందూ పరిషత్ ప్రముఖ్ తుమ్మా మర్రెడ్డి కోరారు. మండలంలోని వేల్పూరు, కోగంటివారిపాలెం గ్రామాలలో ఆయన పర్యటించి, సర్పంచ్‌లు జవ్వా శంకర్, బోనం నాగిరెడ్డిలకు వినతి పత్రాలు అందచేశారు. రానున్న జూన్ 7న బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను, ఇతర జంతువులను వధించే కార్యక్రమాన్ని అడ్డుకోవాలని సూచించారు. గోవులను రక్షించుకోవాలని, వాటి వల్ల శాస్త్రీయంగా కూడా అనేక ఉపయోగాలున్నాయని సూచించారు. తాము బక్రీద్ పండుగ వరకు ప్రతి గ్రామంలో తిరిగి గోవులను వధించే కార్యక్రమంపై ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబటి నారాయణ, ఆదూరి వెంకటేశ్వరరావు, బుర్లె నరసింహారావు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



శిక్షణకు హాజరైన అభ్యాసకులతో కమిషనర్ జస్వంతరావు, జనార్దనరావు గురూజీ

నరసరావుపేట ఈస్ట్: క్రమశిక్షణ, సంపూర్ణ ఆరోగ్యంతో కూడిన జీవనం యోగా ద్వారా సాధ్యపడుతుందని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 186వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ఆనంద మహోత్సవంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మే 21 నుంచి జూన్ 21 వరకు మండల, మున్సిపల్ స్థాయిల్లో యోగా తరగతులను నిర్వహిస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఈనెల 26వ తేదీ నుంచి యోగా తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో యోగా తరగతులు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఒక్కరూ యోగా అభ్యసించాలని ఆయన సూచించారు. యోగ సేవా కేంద్రం ప్రధానాచార్యులు వేంకటేశ్వర గురూజీ ఫోన్ ద్వారా సందేశం అందించారు. కార్యక్రమంలో శిబిరం నిర్వాహక గురూజీ కూనిశెట్టి వెంకట జనార్దనరావు, కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ, సహాయకులు మల్లీశ్వరి, పెండ్యాల సత్యనారాయణ, అడ్డగిరి రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి జయంతి వేడుకలు

క్రోసూరు: క్రోసూరులోని సిద్దిపాలెం అభయాంజనేయ స్వామి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అశేషంగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. క్రోసూరు, చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

పెద్దింటమ్మ వార్షికోత్సవాలు ప్రారంభం



అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతి గ్రామ దేవత పెద్దింటమ్మతల్లి వార్షికోత్సవ కార్యక్రమాలను శనివారం ప్రారంభించారు. తొలిరోజు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, పంచామృత స్నపన, విశేష కుంకుమార్చన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలతో నిర్వహించారు. రెండవరోజు ఆదివారం అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజల అనంతరం శ్రీలక్ష్మీగణపతి హోమం, శక్తిదుర్గాచండీ హోమం, మహా పూర్ణాహుతి నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి భక్తులకు అన్నసంతర్పణ జరుగుతుందని తెలియజేశారు. ఈ వార్షికోత్సవాలలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులుకావాలని నిర్వాహకులు కోరారు.